సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 4 । ఏప్రిల్ । 2025



లక్ష్యాన్ని అధిగమించి..
జిల్లాలోని ఎనిమిది వ్యవసాయ మార్కెట్ల ద్వారా ఫీజు లక్ష్యానికి మించి రూ.1.62 కోట్లు అదనంగా వసూలు చేసి రికార్డు సృష్టించారు. 8లో



అభివృద్ధి పనుల్లో వేగం...
గ్రంథాలయ భవనాలు సహా ఇతర అభివృద్ధి పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశించారు. 8లో

గరిష్టం / కనిష్టం
36° / 24°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి. వాతావరణంలో మార్పులు చేసుకుని ఎండ తీవ్రత తగ్గే అవకాశముంది.

న్యూస్‌రీల్

రేపు జిల్లా బీఆర్‌ఎస్ నేతలతో కేసీఆర్ సమావేశం

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఈనెల 5న ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్‌ఎస్ ముఖ్య నేతలతో సమావేశం కానున్నట్లు తెలిసింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ జరగనుంది. ఈ సభ ఏర్పాట్లు, జన సమీకరణ బాధ్యతలు అప్పగించే విషయమై కేసీఆర్ చర్చించనున్నట్లు సమాచారం. ఇందుకోసం ఈనెల 5న ఉదయం 10గంటలకు ఎర్రవెల్లిలోని తన ఫామ్‌హౌజ్‌లో భేటీ కానున్నట్లు తెలిసింది. ఈ సమావేశానికి ఎంపీలతో పాటు ఎమ్మెల్సీ, జిల్లాల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు రావాలని సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది.

శిక్షణతో నాయకత్వం, మెరుగైన బోధన



శిక్షణలో ఇన్‌చార్జి డీఈఓ, అధికారులు

ఖమ్మంసహకారనగర్: పదోన్నతి పొందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాల ద్వారా మెరుగైన బోధన చేయొచ్చని ఇన్‌చార్జి డీఈఓ సామినేని సత్యనారాయణ తెలిపారు. ఇటీవల పదోన్నతి పొందిన ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు 1,078 మందికి రెండు రోజుల పాటు ఇచ్చే శిక్షణ గురువారం మొదలైంది. ఖమ్మంలోని ఏడు కేంద్రాల్లో శిక్షణ ఇస్తుండగా ఇన్‌చార్జ్ డీఈఓ మాట్లాడారు. హెచ్‌ఎంలకు నాయకత్వం, పాఠశాల అభివృద్ధి, లక్ష్యాల సాధన, బోధనాభ్యాసన ప్రక్రియల నిర్వహణ, తల్లిదండ్రులతో సంబంధాలు, ఆదర్శ పాఠశాలల నిర్వహణపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే, సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు బోధన లక్ష్యాలు, పాఠ్యపుస్తకాలపై అవగాహన, పాఠ్యప్రణాళిక రూపకల్పన, మూల్యాంకన పద్ధతులపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి రవికుమార్, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

తెలంగాణను అగ్రగామిగా నిలపాలి



మాట్లాడుతున్న నాగులు నాయక్

కూసుమంచి: మత్స్యకారులకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవడం ద్వారా చేపల ఉత్పత్తిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలని సూర్యాపేట జిల్లా మత్స్యశాఖ అధికారి నాగులునాయక్ సూచించారు. పాలేరులోని పీ.వీనర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో జిల్లాకు చెందిన ఎస్టీ మత్స్యకారులకు మూడు రోజుల పాటు ఇవ్వనున్న శిక్షణ గురువారం ప్రారంభం కాగా ఆయన మాట్లాడారు. పాలేరులో మత్స్యకారులకు శిక్షణ ఇస్తుండడం అభినందనీయమన్నారు. అనంతరం పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్, శాస్త్రవేత్తలు రవీందర్, భార్గవి, అశ్వారావుపేట ఆత్మా బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శ్రీనివాసరావు చేపల పెంపకం, దాణా తయారీపై అవగాహన కల్పించారు.

జేఈఈ మెయిన్స్‌కు 49మంది గైర్హాజరు

ఖమ్మంసహకారనగర్: జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన గురువారం ఉదయం సెషన్‌లో 543 మందికి 512 మంది, మధ్యాహ్నం సెషన్‌కు 533 మందిలో 515 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలు విజయ ఇంజనీరింగ్ కళాశాల, శ్రీచైతన్య, బొమ్మ, ఎస్‌బీఐటీ కళాశాలల్లో నిర్వహిస్తుండగా రెండు సెషన్లలో కలిపి 49మంది గైర్హాజరయ్యారని నిర్వాహకులు వెల్లడించారు.

జిల్లాలో రెండు బార్‌లకు నోటిఫికేషన్

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలో ఎనిమిదేళ్ల క్రితం మూతపడిన రెండు బార్‌లను కొత్త వారికి అప్పగించేలా ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రంలోని పలుచోట్ల లైసెన్స్ ఫీజు చెల్లించకుండా మూతపడిన బార్లు తిరిగి తెరిచేలా నోటిఫికేషన్ ఇవ్వగా జాబితాలో జిల్లా కూడా ఉంది. ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్ -1 పరిధిలో రెండు బార్ల ఏర్పాటుకు ఆసక్తి ఉన్న వారు రూ.లక్ష చెల్లించి ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుల ఆధారంగా వేలం నిర్వహించి ఖరారు చేయనున్నారు. జిల్లాలో ప్రస్తుతం 37బార్‌లు కొనసాగుతుండగా, కొత్తవి ఏర్పాటైతే ఈ సంఖ్య 39కు చేరుతుంది.

దరఖాస్తులు.. బారులు





ఖమ్మంలోని మీ సేవా కేంద్రంలో సర్టిఫికెట్ల దరఖాస్తు వచ్చిన వారితో రద్దీ

కార్పొరేషన్ల వారీగా అందిన దరఖాస్తులు

బీసీ	ఎస్సీ
18,525	13,272
ఎస్టీ	**మైనార్టీ**
5,350	2,301

రాజీవ్ యువ వికాసం పథకం.. నిరుద్యోగులను దౌడ్ తీయిస్తోంది. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీల్లో అర్హులకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై యూనిట్లు అందజేయనుంది. ఎస్సెస్సీ మొదలు డిగ్రీ చదివిన వారంతా అర్హులేనని ప్రకటించిన నేపథ్యాన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవా కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. ఈనెల 14తో గడువు ముగియనుండగా ఇప్పటివరకు 39,448 మంది దరఖాస్తు చేసకున్నారు.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం

'రాజీవ్ యువ వికాసం'పై నిరుద్యోగుల ఆసక్తి

- ఇప్పటి వరకు జిల్లాలో 39,448 దరఖాస్తులు
- గడువు పెంపుతో మరింతగా పెరగనున్న దరఖాస్తులు
- కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం హైరానా

స్వయం సంవృద్ధి సాధించేలా..

నిరుద్యోగులు సొంతంగా యూనిట్లు స్థాపించుకుని ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి రూపకల్పన చేసింది. ఈ పథకం ద్వారా అర్హులకు సంబంధిత కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీపై యూనిట్లు మంజూరు చేస్తారు. వంద శాతం సబ్సిడీతో రూ.50వేల యూనిట్, 90 శాతం సబ్సిడీతో రూ.లక్ష, 80 శాతం సబ్సిడీతో రూ.2 లక్షలు, 70 శాతం సబ్సిడీతో రూ.4 లక్షల విలువైన యూనిట్ల ఏర్పాటుకు అవకాశముంటుంది.

వెల్లువలా దరఖాస్తులు..

యూనిట్ల కోసం ఇప్పటికే ఆన్‌లైన్‌లో యువత దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు బీసీ కార్పొరేషన్ ద్వారా 18,525 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా ఖమ్మంఅర్బన్ నుంచి 1,788, ఖమ్మం రూరల్‌లో 1,433, కేఎంసీ పరిధిలో 1,361 దరఖాస్తులు రాగా, చింతకాని మండలంలో 1,069 దరఖాస్తులు నమోదవడం గమనార్హం. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యాన యూనిట్లకు 13,272, ఎస్టీ కార్పొరేషన్ పరిధిలో 5,350, మైనార్టీలకు సంబంధించి 2,301 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 14తో గడువు ముగిశాక దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఆతర్వాత వారికి యూనిట్ గ్రౌండింగ్, నిర్వహణలో శిక్షణ ఇవ్వనున్నారు.

సర్టిఫికెట్ల కోసం హడావుడి..

దరఖాస్తు చేసుకోవడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీలకు కుల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి. రేషన్‌కార్డు లేకపోతే ఆదాయ ధ్రువీకరణపత్రం సమర్పించాల్సి ఉంటుంది. దీంతో ఆసక్తి ఉన్న వారు దరఖాస్తుకు మీ సేవ కేంద్రాల వద్ద బారులు దీరుతున్నారు. ఆపై తహసీల్దార్ కార్యాలయాల వద్ద కూడా రద్దీ ఉంటోంది. ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం 65,679 దరఖాస్తులు రాగా.. కుల ధ్రువీకరణ పత్రాల కోసం 13,566 దరఖాస్తులు రావడంతో తహసీల్దార్ కార్యాలయాల ఉద్యోగులు ఎప్పటికప్పుడు పరిశీలించి అర్హులకు జారీ చేస్తున్నారు.

ఆ మండలాల్లోనే పెండింగ్..

జిల్లాలో మొత్తం 164 మీసేవ సెంటర్లు ఉండగా.. అన్ని కేంద్రాలు రద్దీగా కనిపిస్తున్నాయి. అయితే, కొన్ని మండలాల్లో ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం జరుగుతోంది. ఖమ్మం అర్బన్ మండలంలో 9,243 దరఖాస్తులు అందగా 3,070 పెండింగ్‌లో ఉన్నాయి. రఘునాథపాలెం మండలంలో 2,264 దరఖాస్తులకు 1,002 మందికి మంజూరు చేశారు. ఇంకా 1,253 పెండింగ్‌లో ఉన్నాయి. సత్తుపల్లి మండలంలో 3,467దరఖాస్తులకు 2,180 మందికి జారీ చేయగా, 1,262 పెండింగ్‌లో ఉన్నాయి. తిరుమలాయపాలెం మండలంలో 2,829 దరఖాస్తులు అందగా, ఇంకా 906 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉంది.

కుల ధ్రువీకరణ అంతే..

కుల ధ్రువీకరణ పత్రాల జారీలోనూ ఖమ్మం అర్బన్ మండలంలోనే ఎక్కువగా పెండింగ్ ఉన్నాయి. ఇక్కడ 2,276 దరఖాస్తులు అందితే 1,025 మందికి జారీ చేయగా, 1,236 పెండింగ్ ఉన్నాయి. రఘునాథపాలెం మండలంలో 480 దరఖాస్తులకు 440, తిరుమలాయపాలెం మండలంలో 634కి 412, ఏన్కూరు మండలంలో 265 దరఖాస్తులకు గాను 155 పెండింగ్ ఉన్నాయి.

సర్టిఫికెట్ల కోసం తిరుగుతున్నా..



రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేశా. గత నాలుగు రోజుల నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చివెళ్తున్నా. సర్టిఫికెట్ అందితే దరఖాస్తు చేసుకోవాలి. రుణం మంజూరైతే గేదెల యూనిట్ ఏర్పాటు చేసుకుంటా.

– కుంచం భిక్షం, భైరవునిపల్లి, నేలకొండపల్లి మండలం

ధ్రువీకరణ పత్రాల దరఖాస్తుల స్థితిగతులు (మార్చి 1నుంచి ఏప్రిల్ 2వరకు)

వివరం	ఆదాయ ధ్రువీకరణ	కుల ధ్రువీకరణ
దరఖాస్తులు	65,679	13,566
మంజూరు	51,360	8,262
తిరస్కరణ	336	124
పెండింగ్	13,983	5,180

దళారులను నమ్మి నష్టపోకండి..

- ప్రభుత్వ కేంద్రాల్లో మద్దతు ధరతో పాటు సన్నధాన్యానికి బోనస్
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి: రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడారు. ధాన్యం కోతలు ముమ్మరంగా సాగుతున్నందున ప్రభుత్వం కేంద్రాలను ప్రారంభిస్తోందని, ఏదైనా గ్రామంలో ఆలస్యమైనా దళారులకు అమ్మి నష్టపోకుండా వేచి ఉండాలని తెలిపారు. ప్రభుత్వ కేంద్రాల్లో అమ్మడం ద్వారా మద్దతు ధరతో పాటు సన్నధాన్యానికి బోనస్ అందుతుందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతుల రుణాలు మాఫీ చేయడమే కాక రైతుభరోసా ద్వారా పెట్టుబడి సాయం అందిస్తున్నామని, ఇప్పుడు సన్నధాన్యం క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ కూడా చెల్లిస్తున్నామని తెలిపారు. రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, ఈ విషయంలో అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని చెప్పారు. కాగా, కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలోని గంగమ్మతల్లి ఆలయంలో పూజలు చేసిన మంత్రి ఆలయ అభివృద్ధికి విరాళం అందజేశారు. అలాగే, నాయకన్‌గూడెం, జుజుల్‌రావుపేట, పెరికసింగారం, ధర్మాతండా గ్రామాల్లో పలువురిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, డీఆర్డీఓ సన్యాసయ్య, డీఎస్‌ఓ చందన్‌కుమార్, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, ఆర్డీఓ నర్సింహారావు, అడిషనల్ డీఆర్డీఓ నూరుద్దీన్, తహసీల్దారు కరుణశ్రీ, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరా

ఖమ్మంరూరల్: వేసవిలో ఎంత డిమాండ్ పెరిగినా నిరంతర విద్యుత్ సరఫరా చేసేలా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి ఖమ్మం రూరల్ మండలంలో గురువారం ఆయన పర్యటించారు. మద్దులపల్లిలో మద్దులపల్లి నుండి తల్లంపాడు వరకు రూ.1. 80కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు, వరంగల్ క్రాస్‌లో రూ.2కోట్లతో ఏర్పాటు చేసే సబ్‌స్టేషన్, గూడూరుపాడు నుంచి గోళ్లపాడు వరకు రూ.2.37కోట్లతో నిర్మించే రోడ్డు పనులకు శంకుస్థాపన చేశాక మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో జరిగేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. ఐడీసీ, గిడ్డంగుల సంస్థల చైర్మన్లు మువ్వా విజయ్‌బాబు, రాయల నాగేశ్వరరావు, మార్కెట్ చైర్మన్ హరినాథ్‌బాబు, డీఈ హీరాలాల్, ఆర్‌డీఓ నర్సింహారావు, తహసీల్దార్ పి.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. నేలకొండపల్లి మండలంలోని కట్టుకాచారం, అనంతనగర్‌లో రోడ్లు, సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు బోదులబండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారు. ఆతర్వాత కూసుమంచిలో విద్యుత్ రెవెన్యూ కార్యాలయ నిర్మానానికి శంకుస్థాపన చేశాక మత్స్యకారులకు వలలు పంపిణీ చేస్తారు. అనంతరం తిరుమలాయపాలెంలో సీసీ రోడ్డు, పీఏసీఎస్ కార్యాలయం, గోదాం, షాపింగ్ కాంప్లెక్స్, పిండిప్రోలు, తెట్టెలపాడు, మేడిదపల్లిలో సీసీ రోడ్లను ప్రారంభిస్తారు. ఆతర్వాత దమ్మాయిగూడెం-కాకరవాయి మధ్య డ్రైయిన్లు, ఇస్లావత్‌తండా వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేస్తారు.

వెలుగుమట్ల అటవీపార్కులో మంటలు



పార్క్‌లో ఎగిసిపడుతున్న మంటలు

ఖమ్మంఅర్బన్: జిల్లా కేంద్రంలోని వెలుగుమట్ల అటవీ పార్కులో గురువారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పార్క్‌ను ఆనుకుని ఉన్న రైతుల పొలాల్లో చెత్తకు నిప్పు పెట్టగా.. గాలిదుమారంతో ఆ మంటలు పార్క్ వైపునకు వ్యాపించాయి. దీంతో చెట్లు, ఎండుగడ్డి తగలబడుతూ మంటలు భారీగా ఎగిసిపడుతున్నాయి. ఈ మేరకు సమాచారం అందుకున్న అటవీ, అగ్నిమాపక శాఖల ఉద్యోగులు మూడు ఫైరింజన్ల ద్వారా మంటలను అదుపు చేయడంలో నిమగ్నమయ్యారు. తొలుత ఒక ఫైర్ ఇంజన్ రాగా, మరో రెండు వాహనాలను కూడా తెప్పించినట్లు ఖమ్మం ఎఫ్‌ఆర్‌ఓ నాగేశ్వరరావు తెలిపారు. రాత్రి కావడం, గాలికి మంటలు భారీగా ఎగిసిపడుతుండడంతో అటు సిబ్బంది, ఇటు వాహనాలు లోపలకు వెళ్లే పరిస్థితి లేకున్నా అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా, ప్రమాద సమాచారం తెలియగానే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను అప్రమత్తం చేశారు.



మంటలు ఆర్పేందుకు యత్నిస్తున్న సిబ్బంది

రైతు బజార్లలో దళారులకు స్థానం లేదు..

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



రైతుబజార్‌ను ప్రారంభించిన మంత్రి తుమ్మల, పక్కన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తదితరులు

ఖమ్మంవ్యవసాయం: రైతులు తాము పండించిన కూరగాయలు, ఆకుకూరలను రైతుబజార్‌లో నేరుగా అమ్ముకునేలా చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ పక్కన నిర్మించిన రైతుబజార్‌ను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి గురువారం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. గతంలో ఉన్న స్థానంలోనే రైతులకు ఉపయోగపడేలా కలెక్టర్ ప్లాట్ ఫామ్స్, షెడ్లను నిర్మించడం అభినందనీయమన్నారు. అయితే, పంట పండించే రైతులకే ఇక్కడ స్థానం కల్పించాలే తప్ప దళారులకు చోటు ఇవ్వొద్దని అధికారులను ఆదేశించారు. కాగా, మొక్కజొన్న కొనుగోళ్లు త్వరగా మొదలుపెట్టేలా చూస్తామని మంత్రి తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ రైతులు లాభసాటి పంటలపై దృష్టి సారించాలన్నారు. ఖమ్మం గాంధీచౌక్‌లో రూ.35 లక్షల వ్యయంతో మరో రైతుబజార్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు, రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

దేశానికి ఎనలేని సేవ చేసిన కాంగ్రెస్

స్వాతంత్ర్య ఉద్యమంలోనే కాక దేశాభివృద్ధికి కాంగ్రెస్ ఎనలేని సేవలు చేసిందని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని డీసీసీ కార్యాలయంలో కార్పొరేటర్లతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ బీజేపీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడేలా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ యాత్ర నిర్వహించాలని సూచించారు. ఇదే సమయాన రాష్ట్రంలో కాంగ్రెస్ అమలుచేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో పాటు కార్పొరేటర్లు కమర్తపు మురళి, గజ్జల లక్ష్మీవెంకన్న, కన్నం వైష్ణవిప్రసన్న, నాయకులు యర్రం బాలగంగాధర్ తిలక్, కొత్తా సీతారాములు, బాణాల లక్ష్మణ్, బోజెడ్ల సత్యనారాయణ, నల్లపు శ్రీనివాస్, జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

జమలాపురంలో ఎదుర్కోలు ఉత్సవం



వధూవరుల అలంకరణలో స్వామి, అమ్మవార్లు

ఎర్రుపాలెం: శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన జమలాపురం ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు ఉత్సవం జరిపించారు. స్వామి తరఫున ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ, ఉప ప్రధాన అర్చకులు మురళీమోహన్‌శర్మ, వేద పండితులు సాయి అభిలాష్, అమ్మవార్ల తరఫున వేద పండితులు విజయకృష్ణ, అర్చకులు కాసులనాటి రామకృష్ణశాస్త్రి, మారుతీ రఘురామకృష్ణ, మారుతి వెంకటరమణ చేరి వారి గోత్రప్రవరలు, గుణగణాలను ఆసక్తిగా వివరించారు. ఇరువర్గాల నడుమ సంవాదం ఉత్సాహంగా కొనసాగింది. క్రతువు బ్రహ్మగా శ్రీపురాణం రవికుమార్‌శర్మ వ్యవహరించగా ఈఓ కె.జగన్‌మోహన్‌రావు, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు రాజీవ్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆడపిల్ల ఉన్నవారు అదృష్టవంతులు

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



పాపను లాలిస్తూ అమృతతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

కామేపల్లి: ఆడపిల్ల ఇంటికి వరమని, ఆడపిల్ల జన్మించిన కుటుంబీకులు అదృష్టవంతులని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. మండలంలోని కొత్తలింగాల, గోవింద్రాల గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. కొత్తలింగాలకు చెందిన ఉండేటి అమృత-సుధాకర్ దంపతులకు ఇటీవల ఆడపిల్ల జన్మించగా వారితో పాటు సుధాకర్ తల్లిదండ్రులను కలెక్టర్ 'మా పాప – మా ఇంటి మణిదీపం' లో భాగంగా సన్మానించి స్వీట్లు, పండ్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలే ముందు నిలుస్తున్నందున ఆడపిల్లలను చిన్నచూపు చూడకుండా చదివించాలని సూచించారు. ఆతర్వాత ఖమ్మంకు చెందిన డాక్టర్ జానకీరామయ్య-సరోజని మనమడు అభి కొత్తలింగాల అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.5 లక్షల విలువైన సోలార్ ఇన్వెర్టర్లు అందించగా కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం గోవింద్రాలలో బానోత్ లక్ష్మణ్‌నాయక్ సాగు చేస్తున్న మామిడి తోటను పరిశీలించారు. సాగు విధానం, సేంద్రియ విధానంలో పండ్లు మాగబెట్టడం, మార్కెటింగ్‌పై ఆరాతీశారు. ఈ కార్యక్రమాల్లో డీడబ్ల్యూఓ రామ్‌గోపాల్‌రెడ్డి, ఉద్యాన శాఖాధికారి మధుసూదన్‌రావు, ఏడీఏ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రవీందర్, ఏఓ తారాదేవితో పాటు వివిధ శాఖల ఉద్యోగులు, నాయకులు శ్రీనివాసులు, సతీశ్, వేణు, శ్రావణి, సక్రు, ప్రభాకర్‌రెడ్డి, ఉషా, జగదీశ్వర్, వెంకటమ్మ, నల్లమల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన డీసీసీబీ లావాదేవీలు


- రూ.2,984 కోట్ల నుంచి రూ.3,460 కోట్లకు టర్నోవర్
- రూ.9.64 కోట్ల లాభాల్లోకి బ్యాంకు



జిల్లా కేంద్ర సహకార బ్యాంకు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) ప్రగతిబాట పట్టింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లావాదేవీలతో పాటే లాభాలూ పెరిగాయి. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.2,984.31 కోట్లుగా ఉన్న టర్నోవర్ 2024–25 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.3,460.70 కోట్లకు చేరింది. ఏడాది కాలంలో రుణాలు, అడ్వాన్సులు, డిపాజిట్ల రూపంలో రూ. 476.39 కోట్ల టర్నోవర్ పెరిగినట్లయింది. దీంతో 2023–24లో రూ.3.89 కోట్లుగా ఉన్న లాభాలు 2024–25 నాటికి రూ.9.64కోట్లకు చేరాయి. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన డీసీసీబీ 100 పీఏసీఎస్‌లు, 50 బ్రాంచ్‌లతో కొనసాగుతుండగా ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో విస్తరించి ఉంది. బ్యాంకు ద్వారా రైతులకు స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నారు. అన్నదాతతో పాటు వివిధ వర్గాల ప్రజలకు గృహ, మార్ట్‌గేజ్, వాహన రుణాలు ఇస్తుండడమే కాక బంగారం తాకట్టుపై రుణాలు కూడా జారీ చేస్తున్నారు. మరోపక్క పీఏసీఎస్‌ల ద్వారా ఎరువులు, పురుగు మందుల వ్యాపారం, ధాన్యం, మొక్కజొన్నలు వంటి పంట ఉత్పత్తులు కొనుగోళ్లు చేస్తుండగా ఆర్థిక పరిపుష్టి సాధిస్తున్నాయి. ఇక బ్రాంచ్‌ల సంఖ్యను 50 నుంచి 54కి పెంచడంపై అధికారులు దృష్టి సారించారు. కాగా, రుణాల రికవరీతో బ్యాంకు ఎన్‌పీఏ సైతం 1.86 నుంచి 1.27కు తగ్గడం విశేషం.

ఉద్యోగుల కృషి ఫలితంగానే ప్రగతి



డీసీసీబీ అధికారులు, ఉద్యోగుల కృషి ఫలితంగానే బ్యాంకు ప్రగతిపథంలో సాగుతోంది. రుణాలు, డిపాజిట్లు తదితర అంశాల ద్వారా లావాదేవీలతో పాటు లాభాలూ పెరిగాయి. ఈ ప్రగతిని మరింత పెంచేలా పాలకవర్గం, ఉద్యోగుల సహకారంతో ముందుకు సాగుతాం.

– ఎస్.వెంకట్ ఆదిత్య, సీఈఓ, డీసీసీబీ

క్లుప్తంగా

ఈ నెల 10 నుంచి ఐదు రాష్ట్రాలస్థాయి కబడ్డీ పోటీలు

తల్లాడ: మండలంలోని కుర్నవల్లిలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు ఐదు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు వేంకటాచలపతి దేవస్థానం కమిటీ బాధ్యులు వెల్లడించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి జట్లు పాల్గొంటాయని తెలిపారు. మొదటి ఎనిమిది స్థానాల్లో నిలిచే జట్లకు దాతల చేయూతతో రూ.70,116, రూ.50116, రూ.40116, రూ.30116, రూ.25,116, రూ.20116, రూ.15,116, రూ.10,116 అందజేస్తామని పేర్కొన్నారు.

ఒకేషనల్ పరీక్షకు 733 మంది హాజరు

ఖమ్మంసహకారనగర్: ఎస్సెస్సీ ఒకేషనల్ పరీక్ష గురువారం ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 751 మంది విద్యార్థులకు గాను 733 మంది హాజరు కాగా, 18 మంది గైర్హాజరయ్యారని డీఈఓ తెలిపారు. ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు తాను పలు సెంటర్లలో పరిశీలించామని వెల్లడించారు.

కలెక్టరేట్‌లో కార్మికురాలికి పాముకాటు



ఆదిలక్ష్మి కుటుంబీకులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంసహకారనగర్: కలెక్టరేట్ ఆవరణలోని గార్డెన్‌ను శుభ్రం చేస్తున్న క్రమాన ఓ కార్మికురాలిని పాము కాటు వేసింది. కార్మికులంతా గురువారం గార్డెన్‌లో పనిచేస్తుండగా రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంకు చెందిన ఆదిలక్ష్మి కాలిపై పాముకాటు వేయడంతో ఆమె ఆందోళనకు గురైంది. దీంతో కలెక్టరేట్ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఐసీయూలో చికిత్స పొందుతున్న ఆదిలక్ష్మిని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పరామర్శించారు. ఆమె ఆరోగ్యం స్థిరంగానే ఉందని వైద్యులు చెప్పగా మెరుగైన వైద్యం అందించాలని సూచించిన కలెక్టర్ ఆమె కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. కలెక్టరేట్ ఏఓ అరుణ, హార్టికల్చర్ ఆఫీసర్ మధుసూదన్, కలెక్టరేట్ కేర్ టేకర్ వెంకన్న పాల్గొన్నారు.

'యువ వికాసం'కు దరఖాస్తు చేసుకోండి

ఖమ్మంమయూరిసెంటర్: రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా మైనార్టీ నిరుద్యోగులు రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ బి.పురంధర్ సూచించారు. అర్హత కలిగిన వారు టీఎస్‌ఓబీఎంఎంఎస్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఈ నెల 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన వెల్లడించారు.

రామయ్య కల్యాణానికి గోటి తలంబ్రాలు



తలంబ్రాలు కలుపుతున్న భక్తులు

నేలకొండపల్లి: శ్రీరామనవమి సందర్భంగా మండల కేంద్రంలోని రామదాసు ధ్యాన మందిరంలో నిర్వహించే శ్రీసీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. వివిధ ప్రాంతాల భక్తులు మూడు రోజుల నుంచి గోటి తలంబాలు చేస్తుండగా, గురువారం పసుపు, కుంకుమ కలిపి తలంబ్రాలను సిద్ధం చేశారు. అనంతరం శ్రీరామ నామంతో ప్రత్యేక పూజలు చేయగా, అర్చకులు సౌమిత్రి రమేశ్, భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడి ఆలయంలో చోరీ

పెనుబల్లి: మండలంలోని పాతకారాయిగూడెం గ్రామంలో ఉన్న శ్రీకృష్ణుడి ఆలయంలో చోరీ జరిగింది. దుండగులు బుధవారం రాత్రి ఆలయంలోకి ప్రవేశించి హుండీ పగులగొట్టి సుమారు రూ.30వేల నగదు ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని గురువారం ఉదయం గమనించిన నిర్వాహకులు గ్రామపెద్దలకు సమాచారం ఇవ్వగా వీఎం బంజర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,040	2,000
పెసలు	7,500	4,000
మినుములు	6,800	6,800
అలసంద	5,800	5,800
మిర్చి	13,200	6,000
మిర్చి తాలు	5,500	4,500
పత్తి	7,300	6,400

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,871

లక్ష్యాన్ని అధిగమించి..

- అధిక ఆదాయం సాధించిన మార్కెట్లు
- మార్కెట్ల ఫీజు రూ.65.56 కోట్లుగా నమోదు
- ఇందులో ఖమ్మం మార్కెట్ వాటా రూ.30.57 కోట్లు
- కాస్త వెనుకబడిన నేలకొండపల్లి, ఏన్కూరు



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన మిర్చి

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో వ్యవసాయ మార్కెట్ల ఆదాయం పెరిగింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ జిల్లాకు నిర్దేశించిన లక్ష్యానికి మించి మార్కెట్ ఫీజులు వసూలయ్యాయి. జిల్లాలోని ఎనిమిది వ్యవసాయ మార్కెట్ల ఫీజు లక్ష్యం రూ.63.94 కోట్లు కాగా రూ.65.56 కోట్లు అంటే అదనంగా రూ.1.62 కోట్లు వసూలయ్యాయి. నేలకొండపల్లి, ఏన్కూరు మినహా అన్ని మార్కెట్లు లక్ష్యాన్ని దాటడం విశేషం. పంట విక్రయాల ధర ఆధారంగా కొనుగోలు చేసిన వ్యాపారులు, సంస్థల నుంచి మార్కెటింగ్ శాఖ ఒక శాతం పన్ను వసూలు చేస్తుంది. గతేడాది సమృద్ధిగా వర్షాలు కురవటం, జలాశయాల్లో నీరు ఉండడంతో పంటలు, ఉత్పత్తి ఆశాజనకంగా ఉంది. మిర్చితో పోలిస్తే మిగతా పంటలు ధరలు బాగానే ఉండడంతో పన్ను అదేస్థాయిలో వసూలైంది. మిర్చి ధర కూడా బాగుంటే మార్కెట్ల ఆదాయం మరింత పెరిగేది.

సగం ఖమ్మం నుంచే..

జిల్లాకు నిర్దేశించిన లక్ష్యంలో సగభాగం ఖమ్మం మార్కెట్ నుంచే వసూలైంది. రాష్ట్రంలో పెద్ద వ్యవసాయ మార్కెట్లలో ఖమ్మం ఒకటి కాగా, 'తేజా' రకం మిర్చి కొనుగోళ్లు జోరుగా సాగుతుండడంతో ఈ మార్కెట్ ఫీజు లక్ష్యాన్ని దాటింది. ఖమ్మం మార్కెట్‌కు రూ.30.02 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించగా.. రూ.55 లక్షలు అదనంగా కలిపి రూ.30.57 కోట్లు వసూలవడం విశేషం. ఇది గతేడాదితో పోలిస్తే రూ.3 కోట్లు అదనమని అధికారులు వెల్లడించారు.

ఇవి కూడా ముందుకొస్తే..

ఖమ్మం, మధిర, కల్లూరు, వైరా, సత్తుపల్లి, మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్లు లక్ష్యానికి మించి ఫీజు వసూలు చేయగా, నేలకొండపల్లి, ఏన్కూరు మార్కెట్లు వెనుకబడ్డాయి. నేలకొండపల్లి మార్కెట్‌కు రూ.3.78 కోట్ల లక్ష్యానికి గాను రూ.3.66 కోట్లు, ఏన్కూరు మార్కెట్ రూ.4.87 కోట్లకు గాను రూ.3.43 కోట్లు వసూలయ్యాయి. ప్రభుత్వ సంస్థల నుంచి ఫీజులు పూర్తిస్థాయిలో వసూలైతే మార్కెట్లకు మరింతగా ఆదాయం పెరిగే అవకాశముంది.

2024-25లో మార్కెట్ల వారీగా ఆదాయం (రూ.లక్షల్లో)

మార్కెట్	లక్ష్యం	వసూలు
ఖమ్మం	3002.85	3057.91
మధిర	475.19	484.20
నేలకొండపల్లి	378.34	366.48
కల్లూరు	567.38	678.28
వైరా	673.58	694.93
ఏన్కూరు	487.70	343.18
సత్తుపల్లి	494.79	601.44
మద్దులపల్లి	315.10	330.04
మొత్తం	6,394.93	6,556.46

మంత్రి క్యాంపు కార్యాలయ ముట్టడికి యత్నం

విద్యార్థి సంఘాల నేతలను అడ్డుకున్న పోలీసులు



మంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్తున్న నేతలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



ఖమ్మం జెడ్పీ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూముల పరిరక్షణ కోసం ఉద్యమించాల్సిన అవసరముందని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ అన్నారు. హెచ్‌సీయూ భూముల వేలాన్ని నిలిపివేయాలనే డిమాండ్‌తో గురువారం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యాన ఖమ్మంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ముట్టడికి యత్నించారు. ఈ మేరకు శ్రీశ్రీ సర్కిల్ నుంచి మంత్రి క్యాంపు కార్యాలయం వైపు వెళ్తున్న నేతలను పోలీసులు అడ్డుకుని అర్బన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత రామకృష్ణతో పాటు ఎస్‌ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, జార్జిరెడ్డి పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శులు ప్రవీణ్, మస్తాన్, ఎం.సురేశ్ మాట్లాడారు. అక్రమ అరెస్టులను నిలిపివేసి యూనివర్సిటీ భూముల వేలం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మాగం లోకేశ్, సుధాకర్, శివ, నాగుల్‌మీరా, రాజు, అజయ్, వంశీ, వినోద్, మనోజ్, సాగర్, భాను, ఉదయ్, ప్రతాప్, గోపి, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యాన నిరసన

ఖమ్మంమామిళ్లగూడెం: సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని నిలిపివేయాలనే డిమాండ్‌తో బీజేవైఎం నాయకులు ఖమ్మం జెడ్పీసెంటర్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ యూనివర్సిటీ భూములను రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయనుండడం సరికాదన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనంత ఉపేందర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు దుద్దుకూరు కార్తీక్, నాయకులు ఈదుల భద్రం, డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, డాక్టర్ శీలం పాపారావు, మందడపు సుబ్బారావు, సుదర్శన్ మిశ్రా, నల్లగట్ల ప్రవీణ్‌కుమార్, రేఖ వెంకటసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

1, 3, 5వ సెమిస్టర్లలో ఫెయిలైన వారికి అవకాశం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ కోర్సుల మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షలు మరోసారి నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. కొద్దినెలల క్రితం ఈ పరీక్షలు నిర్వహించిన అధికారులు మార్చి 4న ఫలితాలు కూడా వెల్లడించారు. అయితే, ఉత్తీర్ణత శాతం తక్కువగా రావడంతో ఆయా సెమిస్టర్ల పరీక్షలు మరోసారి నిర్వహించాలనే వినతుల దృష్ట్యా సానుకూల నిర్ణయం తీసుకున్నారు. ఒక విధంగా వీటిని సప్లిమెంటరీ పరీక్షలుగానే భావించవచ్చు. ఈ నెల మూడో వారం నుంచి నిర్వహించే డిగ్రీ కోర్సుల 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షలతో పాటు వీటిని నిర్వహించనుండగా, శుక్రవారం పరీక్ష ఫీజు నోటిఫికేషన్ జారీ చేస్తారు. సెమిస్టర్ విధానం వచ్చాక ఓసారి పరీక్షలు నిర్వహించి ఫలితాలు వెల్లడించాక మళ్లీ అవే పరీక్షలు నిర్వహించడం లేదు. కానీ యూనివర్సిటీ చరిత్రలో తొలిసారి మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ల పరీక్షలు నిర్వహిస్తుండడం ఫెయిలైన విద్యార్థులకు మంచి అవకాశంగా భావిస్తున్నారు.

పీజీ కోర్సుల సెకండియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంటీఎం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంహెచ్‌ఆర్ఎం, జర్నలిజం మాస్ కమ్యూనికేషన్ తదితర పీజీ కోర్సుల(నాన్ ప్రొఫెషనల్) రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంటు) ఈనెల 26వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. ఈవిషయాన్ని పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సౌజన్య తెలిపారు. ఈనెల 26, 28, 30, మే 2, 5, 7వ తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన మహిళ అరెస్ట్

ఖమ్మంక్రైం: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులను నమ్మించి రూ.లక్షల్లో డబ్బు కాజేసిన మహిళను అరెస్ట్ చేసినట్లు ఖమ్మం టూటౌన్ పోలీసులు గురువారం తెలిపారు. రాపర్తినగర్ వివేకానంద కాలనీకి చెందిన గుదిబండ్ల ఆదిలక్ష్మి మామిళ్లగూడెం ప్రాంతానికి చెందిన పోట్ల హరీష్‌తో పాటు పలువురికి ఉద్యోగాలు ఇప్పిస్తానని సుమారు రూ.16లక్షల మేర వసూలు చేసింది. ఈ విషయమై అందిన ఫిర్యాదుతో ఆమెను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, గతంలోనూ ఆదిలక్ష్మిపై పలు స్టేషన్లలో కేసులు ఉన్నాయని సీఐ బాలకృష్ణ తెలిపారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి..



ముదిగొండలో గ్రంథాలయం వివరాలు ఆరా తీస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

నేలకొండపల్లి/ముదిగొండ: అభివృద్ధి పనుల్లో ఎక్కడా జాప్యం జరగకుండా శరవేగంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. నేలకొండపల్లి, ముదిగొండ మండలాల్లో గురువారం పర్యటించిన ఆమె తొలుత నేలకొండపల్లిలో ఏళ్లుగా సాగుతున్న గ్రంథాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఇకనైనా పనులు శరవేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆ తర్వాత మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువశక్తి పథకం కౌంటర్, ఎంఈఓ కార్యాలయంలో యూనిఫాం వస్త్రం పరిశీలించగా, పలుచోట్ల డ్రెయినేజీలు, రోడ్లను శుభ్రం చేయడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శిని ఆమె ఆదేశించారు. ఆ తర్వాత ముదిగొండ మండలంలోని ముదిగొండ, గోకినేపల్లిల్లో గ్రంథాలయాలను అదనపు కలెక్టర్ శ్రీజ పరిశీలించి, ముదిగొండలో భవనం శిథిలావస్థలో ఉన్నందున కొత్త భవనం నిర్మించే వరకు ఇతర చోటకు మార్చాలని సూచించారు. ఎంపీడీఓలు యం.యర్రయ్య, శ్రీధర్‌స్వామి, ఎంపీఓ సీహెచ్ శివ, ఐకేపీ ఏపీఎం శ్రీనివాసరావు, లైబ్రేరియన్ మచ్చా సత్యనారాయణ పాల్గొన్నారు.

'రాజ్యాంగాన్ని అవమానిస్తున్న బీజేపీ'



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షులు దుర్గా ప్రసాద్, పక్కన ఎమ్మెల్యే రాగమయి తదితరులు

సత్తుపల్లి/వేంసూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య కుల, మత విద్వేషాలు సృష్టించడమే కాక రాజ్యాంగాన్ని అవమానిస్తోందని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంతో పాటు వేంసూరులో గురువారం జై బాపు, జై భీం, జైసంవిధాన్‌పై నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గాంధీ, అంబేడ్కర్‌ను పార్లమెంట్‌లో అవమానించిన బీజేపీ పెద్దలు, రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యాన బీజేపీ తీరును ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాక కాంగ్రెస్ పథకాలను వివరించాలని సూచించారు. నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, ముక్కా శేఖర్‌గౌడ్, శివవేణు, గాదె చెన్నారావు, మందపాటి ముత్తారెడ్డి, ఆనంద్‌బాబు, తోట సుజలారాణి, చల్లగుండ్ల కృష్ణయ్య, అలవాల కరుణాకర్, కుమారి, కమల్‌పాషా, ఉడతనేని అప్పారావు పాల్గొన్నారు.

గోదావరిని పరిశీలించిన కేంద్ర జలసంఘం

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం వద్ద గోదావరిని కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) సభ్యులు గురువారం సందర్శించారు. ఉత్తరాఖండ్‌లోని రూర్కీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీకి చెందిన డాక్టర్ రవీంద్ర విఠల్ కాలే, ప్రొఫెసర్ ముత్తయ్య పెరుమాళ్ భద్రాచలం కేంద్ర జల సంఘం కార్యాలయ సబ్ డివిజన్ ఇంజనీర్ కె.పృథ్వీరాజ్ నేతృత్వంలో పరిశీలించారు. నూతన బ్రిడ్జిపై 'ఎంట్రోపీ ఇమేజ్ ప్రాసెసింగ్ బేస్డ్ నాన్ కాంటాక్ట్ డిశ్చార్జ్ మానిటరింగ్ టెక్నిక్' అనే యంత్రాన్ని అమర్చేందుకు అనుకూలమైన వాతావరణం ఉన్నట్లు నిర్ధారించారు. దీంతో నది ఉపరితల ప్రవాహ వేగాన్ని విశ్లేషించి కచ్చితమైన సమాచారం వస్తుంది. వర్షాకాలం వరదల సమయంలో ఈ వ్యవస్థ పూర్తి స్థాయిలో ఉపయోగపడనుందని, రానున్న 24 గంటల్లో ఎగువ నుంచి ఎంత వరద వస్తుందో అంచనా వేయవచ్చని తెలిపారు. భద్రాచలంలో ప్రతీ నిమిషానికి పెరుగుతున్న నీటి వేగాన్ని అంచనా వేసి హెచ్చరిక స్థాయి వరద ఎన్ని గంటలకు వస్తుందో గుర్తించవచ్చని, తద్వారా లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేయొచ్చని వివరించారు.

యూవీకెన్ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ కళావతిబాయి

కామేపల్లి: మహిళలు రొమ్ము కేన్సర్ బారిన పడకుండా అవగాహన కల్పించేందుకు యువరాజ్‌సింగ్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని డీఎంహెచ్ఓ కళావతిబాయి తెలిపారు. యూవీకెన్ ఫౌండేషన్ ఆధ్వర్యాన కామేపల్లి మండలంలోని మహిళలకు ఉచితంగా రొమ్ము కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించగా, ఫౌండేషన్ సిబ్బందికి గురువారం అభినందన సభ ఏర్పాటు చేశారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. ప్రతీ మహిళ రొమ్ము కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. మండలంలో యూవీకెన్ ఫౌండేషన్ ద్వారా 3,997 మందికి పరీక్షలు చేయగా, 48 మంది అనుమానితులకు నిర్ధారణ కోసం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయిస్తున్నామని తెలిపారు. అనంతరం ఏఎన్‌ఎంలు, ఆశాలకు క్రికెట్ పోటీలను నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సైదులు, డీఐఓ చందునాయక్, డీపీఓ దుర్గ, ఫౌండేషన్ జిల్లా మేనేజర్ హరిత భూపాలన్, సిబ్బంది సత్యవతి, డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య లోపం ఎదురుకావొద్దు



రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ

ముదిగొండ: గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య లోపం ఎదురుకాకుండా నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత సూచించారు. ముదిగొండ పంచాయతీ కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేసిన ఆమె రికార్డులు పరిశీలించాక మాట్లాడారు. ఆర్థిక సంవత్సరం మొదటి నుంచే పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలని తెలిపారు. అలాగే, పారిశుద్ధ్య సమస్య, నీటిఎద్దడి ఎదురుకాకుండా చూడాలని సూచించారు. డీఎల్‌పీఓ రాంబాబు, ఎంపీఓ వాల్మీకి కిశోర్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

షాదీఖానా వద్ద ముస్లింల ఆందోళన



షాదీఖానా ఎదుట ఆందోళన చేస్తున్న ముస్లింలు

ఖమ్మంమయూరిసెంటర్: ఏటా రంజాన్ తర్వాత జరుపుకునే ఈద్ మిలాప్ కార్యక్రమానికి అధికారులు కావాలనే అడ్డుపడుతున్నారని ముస్లింలు ఆందోళనకు దిగారు. ఖమ్మంలోని షాదీఖానాలో శుక్రవారం సాయంత్రం నిర్వహించుకునేందుకు తొలుత అనుమతి ఇచ్చిన అధికారులు రద్దు చేయడంపై గురువారం సాయంత్రం ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ నేతల వైఖరితోనే ఇలా జరుగుతోందని వారు ఆరోపించారు. చివరకు షాదీఖానాలో శుక్రవారం ఈద్ మిలాప్ నిర్వహించుకునేందుకు తహసీల్దార్ అనుమతి ఇవ్వగా వారు ఆందోళన విరమించారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఖమర్, తాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

మిర్చి ధర మరింత పతనం

ఖమ్మంవ్యవసాయం: ఇప్పటికే మిర్చి ధర పడిపోయిందని రైతులు ఆందోళన చెందుతుండగా గురువారం మరింత పతనమైంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో 'తేజా' రకం మిర్చికి బుధవారంతో పోలిస్తే గురువారం ధర తగ్గింది. బుధవారం జెండా పాట క్వింటాకు ధర రూ.13,300, మోడల్ ధర రూ.12వేలు పలకగా, గురువారం రూ.13,200, రూ.10,500గా నమోదయ్యాయి. జెండాపాట రూ.100, మోడల్ ధర ఏకంగా రూ.1,500లు తగ్గడంతో రైతులు ఆందోనకు గురయ్యారు. గురువారం ఖమ్మం మార్కెట్‌కు సుమారు 75 వేల మిర్చి బస్తాలు విక్రయానికి రాగా, పంట కోతలు చివరి దశకు చేరడంతో నాణ్యత తగ్గుతోందని వ్యాపారులు చెబుతున్నారు.

దాచుకున్న డబ్బు బలవంతంగా ఎత్తుకెళ్లారు..

మనవళ్లపై పోలీసులకు వృద్ధ దంపతుల ఫిర్యాదు



ఫిర్యాదు చేయడానికి వచ్చిన వెంకయ్య–గురువమ్మ

కొణిజర్ల: వృద్ధాప్యంలో తమకు అండగా నిలిచే వారికి ఇచ్చేలా దాచుకున్న నగదును మనవళ్లు లాక్కెళ్లారని వృద్ధ దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని గద్దలగూడెంనకు చెందిన దేవళ్ల వెంకయ్య – గురువమ్మ దంపతులకు ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అందరికీ వివాహాలు జరగగా, ముగ్గురు కొడుకులకు నాలుగెకరాల చొప్పున పొలం పంచి ఇచ్చారు. ఆపై అవసరాలకు రెండెకరాలు ఉంచుకోగా, ఇటీవల ఇద్దరూ అనారోగ్యం పాలవడంతో చికిత్స నిమిత్తం ఎకరన్నర పొలం అమ్మగా వచ్చిన రూ.4.50 లక్షలు ఇంట్లో భద్రపరిచారు. ఈ నెల 2న వెంకయ్య పెద్ద కొడుకు రాములు కొడుకులైన నవీన్, శ్రీకాంత్ ఇంట్లోకి జొరబడి తమను కొట్టి డబ్బు ఎత్తుకెళ్లారని వాపోయారు. దీన్ని అడ్డుకున్న గురవమ్మను నెట్టివేయడంతో కాలు విరిగిందని తెలిపారు. కాగా, చాలాకాలం కిందటే రాములు మృతి చెందాడని వృద్ధులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సూరజ్ తెలిపారు.

బధిరురాలి గర్భానికి కారణమైన బంధువు

- అరెస్ట్ చేసిన పోలీసులు

తిరుమలాయపాలెం: పింఛన్ కోసం వచ్చే బంధువు, బధిరురాలైన మహిళను నమ్మించి గర్భవతిని చేసిన వ్యక్తిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. మండలంలోని సుబ్లేడులో మినీ ఏటీఎం నిర్వహిస్తున్న కామళ్ల వీరయ్య వద్దకు ఆయన బంధువు, 34 ఏళ్ల మూగ, చెవిటి మహిళ పింఛన్ కోసం వచ్చేది. ఈ క్రమంలో ఆమెను నమ్మించిన వీరయ్య శారీరకంగా దగ్గరవడంతో ఆమె గర్భం దాల్చింది. దీంతో బాధితురాలి తల్లిదండ్రులకు విషయం తెలియగా ఇటీవల ఆయనను నిలదీశారు. కానీ, ఆయన దౌర్జన్యంగా ప్రవర్తించడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గత 25న కేసు నమోదు చేయగా, గురువారం వీరయ్యను అదుపులోకి తీసుకుని కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు.

అసత్యప్రచారం చేస్తున్నారని ఫిర్యాదు

ఖమ్మంక్రైం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘానికి చెందిన కొందరు నాయకులు.. జేఏసీలో భాగస్వామ్య పక్షమైన టీఎన్జీవోస్ యూనియన్, హౌస్ బిల్డింగ్ సొసైటీపై అసత్యప్రచారం చేస్తున్నారని అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు వారిపై గురువారం ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఓ ప్రకటనలో వెల్లడించారు.